క్లుప్తంగా

తపాలా శాఖ సేవలు సద్వినియోగం చేసుకోండి



పుట్లూరులో పోస్టల్ సేవలను వివరిస్తున్న ఐపీఓ రమేష్‌రెడ్డి

పుట్లూరు: తపాల శాఖ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తపాలా శాఖ ఐపీఓ రమేష్ రెడ్డి కోరారు. 'జనం లోకి మనం' కార్యక్రమంలో భాగంగా బుధవారం తపాలా శాఖ ఐపీఓ రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పోస్టాఫీసులో ఐపీపీబి, ఆర్‌డీ, ఐపీఓ, ఎస్‌బిల ద్వారా నగదు లావాదేవీలు, పొదుపు పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్‌పీఎం రామాంజినేయులు, సిబ్బంది యేసేబు, పురుషోత్తం, రాంబుపాల్, పోలిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రామక్రిష్ణారెడ్డి, సాంబశివుడు, పెద్దిరాజు, రమణ, షెక్షావలి, రాజకుల్లాయప్ప, ప్రభంజనయ్య తదితరులు పాల్గొన్నారు.

రిట్రీట్‌ను జయప్రదం చేయండి

పామిడి: స్థానిక సీఎస్ఐ చర్చిలో రెండో శనివారం నుంచి రెండురోజుల పాటు నిర్వహించనున్న స్త్రీల మైత్రి రిట్రీట్‌ను జయప్రదం చేయాలని చర్చి పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ బుధవారం తెలిపారు. ఈసందర్భంగా రెండో శనివారం స్త్రీల మైత్రివారికి భోజన సదుపాయంతో ఉంటుందన్నారు. స్త్రీల ఆధ్వర్యంలో ఆదివారం ఆరాధన నిర్వహిస్తామన్నారు.

రేషన్ పంపిణీ పూర్తి చేయండి

శింగనమల: మండలంలోని ఎండీయూ ఆపరేటర్లు రేషన్ పంపిణీని త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ మోహన్‌బాబు, సీఎస్‌డీటీ రాజశేఖర్ ఆదేశించారు. బుధవారం వారు మాట్లాడుతూ మండలంలోని ఇంకా కొంత మంది డీలర్లు ఎండీయూ ఆపరేటర్లకు సరుకులు అందించలేదన్నారు. సరుకులను వెంటనే ఎండీయూలకు అందించాలన్నారు. ఇప్పటి వరకూ మండలంలో 13,611 రేషన్ కార్డులుంటే 10344 మందికి రేషన్ పంపిణీ చేశారని తెలిపారు.

విద్యతో ఉజ్వల భవిష్యత్తు



నగదు బహుమతులు అందిస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్ : విద్యతో ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని తాడిపత్రి పెన్షనర్ల సంఘం సభ్యులు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులతో సత్కరించారు. 600 మార్కులకు 549 మార్కులు సాధించిన షేక్ నజీర్‌బాబాకు రూ.5 వేలు, 538 మార్కులు సాధించిన రబ్బానికి రూ.3 వేలు, 498 మార్కులు సాధించిన కార్తీక్‌కు రూ.2వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రంగయ్య, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి, సభ్యులు ఆదినారాయణస్వామి, వీరారెడ్డి, హనుమంతరెడ్డి, నరసింహులు, రమణరాజు, వెంకట్రామయ్య, కరుణాకర్, రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కొలువుదీరిన పీర్లస్వాములు



పెద్దయక్కలూరులో కొలువుదీరిన పీర్లస్వాములు

పెద్దపప్పూరు: మొహర్రం వేడుకల్లో భాగంగా బుధవారం పెద్దయక్కలూరు గ్రామంలో పీర్ల స్వాములు కొలువుదీర్చారు. హిందూ, ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించి కొలిచే బారేమామ్(చిన్నపిల్లల పీరు)తో పాటు అస్సేన్, హుస్సేన్ పీర్ల స్వాములను తెల్లవారుజామున ప్రథమ దర్శనం కల్పించారు. ఏటా గ్రామస్తుందరూ ఐకమత్యంతో మొహర్రం వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని నిర్వాహకులు పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనం దగ్ధం



మంటల్లో కాలిపోయిన ద్విచక్ర వాహనం

పెద్దవడుగూరు: చింతలచెరువు గ్రామంలో ద్విచక్ర వాహనం అగ్నికి ఆహుతైంది. బాధితుడి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మైలా రామ్మోహన్ మంగళవారం రాత్రి తన హోటల్ ముందు విద్యుత్ స్తంభం వద్ద బైక్‌ను ఉంచాడు. బుధవారం తెల్లవారుజామున బైక్ నుంచి మంటలు వెలువడటాన్ని గమనించిన స్థానికులు ఆర్పేందుకు యత్నించారు. అయితే అప్పటికే వాహనం పూర్తిగా కాలిపోయింది. ఘటనలో సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు యాడికి రూరల్ సర్కిల్ సీఐ రోషన్ తెలిపారు.

రాజకీయ వేధింపులను అరికట్టాలి



తాడిపత్రిలో డీటీకి వినతిపత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు



గుంతకల్లులో అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



పుట్లూరులో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

తాడిపత్రి రూరల్: రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత జిల్లాలో అంగన్‌వాడీ కార్యకర్తలపై రాజకీయ వేధింపులు ప్రారంభమయ్యాయని వాటిని అరికట్టాలనిని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యునియన్ నాయకులు డిమాండ్ చేశారు. . కోర్కెల దినోత్సవాన్ని పురస్కరించుకొని పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్‌కు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని ప్రాంతాల్లోఅంగన్‌వాడీ కార్యకర్తలను బలవంతంగా రాజీనామా చేయించారని, అంగన్‌వాడీ సెంటర్లకు తాళాలు వేశారన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో యునియన్ నేతలు జ్యోతిలత, గోవిందమ్మ తదితరులు ఉన్నారు.

పుట్లూరు: కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వం చాలా చోట్ల అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలను రాజీనామాలు చేయాలని పెత్తనం చేయడం సరికాదని మండల అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యునియన్ సభ్యులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కోర్కెల దినోత్సవం సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్ ప్రసాద్‌కు అందించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సూరి, అసోషియేషన్ నాయకులు జయలలిత, శశికల, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: అఖిల భారత కోరికల దినోత్సవాన్ని పురస్కరించుకొని అంగన్‌వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ పట్టణాధ్యక్షుడు రమేష్, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు గంగా, రేష్మా తదితరులు మాట్లాడారు. ఐసీడీఎస్‌ను బలోపేతం చేస్తామని, అంగన్‌వాడీల వేతనాలు పెంచుతామని గత బీజేపీ ప్రభుత్వం హామీ ఇచ్చిన నేటికీ నెరవేర్చలేదన్నారు. అనంతరం ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సువర్ణకు వినతిపత్రాన్ని అందజేశారు.

పామిడి: పామిడిలో బుధవారం ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అఖిల భారత కోర్కెల దినోత్సాన్ని పురస్కరించుకొని వారు తమ సమస్యల పరిష్కారం కోసం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఐసీడీఎస్‌ను బలోపేతం చేసేలా బడ్జెట్ పెంచాలన్నారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్‌కు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు జయంతి, భారతి, అనిత తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు: అంగన్‌వాడీ సిబ్బంది సమస్య తీర్చాలని ఆ యూనియన్ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ జయప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలి, ఐఎల్‌సీ సిఫార్సుల ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల తర్వాత కొన్ని ప్రాంతాల్లో అంగన్వాడీ కార్యకర్తలను బలవంతంగా రాజీనామాలు చేయించడం, సెంటర్లకు తాళాలు వేస్తున్నారని, ఇలాంటి వాటిని ప్రభుత్వం అరికట్టాలన్నారు.

రోడ్డుపై అడ్డుగోడలు తొలగించాలి



రైల్వే అధికారికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు: రైల్వే ఏరియాల్లోకి బయట ప్రజలు వెళ్లాకుండా దారులను మూసి వేయడాన్ని నిరసిస్తూ పట్టణ పౌరుల సంక్షేమ సంఘం, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఐద్వా ఆధ్వరంలో బుధవారం డీఆర్ఎం కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మస్తాన్‌పేట, పోర్టర్‌లైన్ తదితర ప్రాంతాల్లో చిన్నపాటి మార్గాలను రైల్వే అధికారులు మూసివేయడంతో చందమామ స్కూలు, సెంట్ జోసఫ్ హైస్కూల్, చర్చి హైస్కూల్, రైల్వే హైస్కూళ్లతోపాటు రైల్వే ఆస్పత్రి, రైల్వేస్టేషన్‌కు వెళ్లడానికి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్డుపై నిర్మించిన అడ్డుగోడలను వెంటనే తొలగించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం రైల్వే అధికారులకు వినతిప్రతం అందజేశారు. పట్టణ పౌరుల సంక్షేమ సంఘం కార్యదర్శి మారుతిప్రసాద్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేంద్రబాబు, ఐద్వా అధ్యక్షురాలు జ్యోతి, కార్యదర్శి రంగమ్మ, సీపీఎం నాయకులు బి.శ్రీనివాసులు, దాసరి శ్రీనివాసులు, సీఐటీయూ నాయకులు సాకే నాగరాజు, కసాపురం రమేష్, కేవీపీఎస్ నాయకులు జగ్గిలి రమేష్, రామునాయక్‌తోపాటు మస్తాన్‌పేట వాసులు పాల్గొన్నారు.

'నేనెవరికీ అద్దె చెల్లించడం లేదు'



గుజిరీ వ్యాపారస్తుడితో మాట్లాడుతున్న సర్పంచ్ అనురాధ, ఈఓఆర్‌డీ వెంకటేశ్వర్లు

యాడికి: గుజిరీ షాపు కోసం తాను ఎవరికీ అద్దె చెల్లించలేదని వ్యాపారి కుళ్లాయప్ప స్పష్టం చేశాడు. మండల కేంద్రంలోని సంతమార్కెట్ వీధిలో గుజిరీ వ్యాపారి కుళ్లాయప్ప నుంచి ఓ వైఎస్సార్‌సీపీ నేత ఐదేళ్లుగా బలవంతంగా అద్దె వసూలు చేస్తున్నట్లుతో ఓ దినపత్రికలో బుధవారం వార్త ప్రచురితమైనది. స్పందించిన ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు, సర్పంచ్ అనురాధ గుజిరీ దుకాణం వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా వారు వైఎస్సార్‌సీపీ నాయకులకు ఎవరికైనా అద్దె చెల్లిస్తున్నావా అని గుజిరీ దుకాణ యజమానిని ప్రశ్నించారు. తాను గత 15 ఏళ్లుగా ఇక్కడ గుజిరీ వ్యాపారం చేస్తున్నానని, అయితే ఇప్పటి వరకూ తనను ఎవరూ అద్దె అడగలేదని, తానూ ఇవ్వలేదన్నారు. పత్రికల్లో ఏదేదో రాస్తుంటారని, వాటితో తనకు నాకు సంబంధం లేదని చెప్పొకొచ్చాడు. అనంతరం ఈఓఆర్డీ, సర్పంచ్ మాట్లాడుతూ సోషియల్ మీడియా, పత్రికల్లో ఇష్టానుసారం వార్తలు రాయటం మంచి పద్ధతి కాదన్నారు. పశువుల ఆసుపత్రి ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలంలో గుజిరీ సామాన్లు వేసుకుని వ్యాపారం చేసుకుంటున్నందుకు పంచాయతీ కార్యాలయంలో ప్రతి నెలా రూ.5 వేలు రుసుం చెల్లించి రసీదు పొందాలని వారు గుజిరీ వ్యాపారస్తుడికి తెలియజేశారు.

ఉద్యాన పంటల సాగు లాభదాయకం



బీకేఎస్‌లో ఉద్యాన పంటను పరిశీలిస్తున్న హెచ్‌ఓ శైలజ

బుక్కరాయసముద్రం: ఉద్యాన పంటల సాగు లాభదాయకంగా ఉంటుందని మండల ఉద్యాన శాఖ అధికారి శైలజ పేర్కొన్నారు. బుధవారం కొట్టాలపల్లి, సిద్ధరాంపురం, బీకేఎస్ గ్రామాలలో రైతులు సాగు చేసిన ఉద్యాన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీటి వనరులు తక్కువ ఉన్నా స్వల్ప పెట్టుబడితో ఉద్యాన పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకం కల్పిస్తోందన్నారు. రైతులు నేరేడు, మామిడి, చీనీ, అంజూర, డ్రాగన్ ఫ్రూట్స్ తదితర పంటల సాగుతో మరింత ఆదాయం పొందవచ్చని సూచించారు. ఉద్యాన పంటల్లో యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఆర్బీకే సిబ్బంది అనూష, ముని తదితరులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



వృద్ధుడి శవాన్ని అంత్యక్రియలకు తరలిస్తున్న ఆ నలుగురు సేవాసమితి సభ్యులు

గుంతకల్లుటౌన్: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో మృతి చెందిన గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహానికి ఆ నలుగురు సేవాసమితి సభ్యులు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటారు. వన్‌టౌన్ పోలీసుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వాస్పత్రి పోస్ట్ మార్టమ్ రూమ్ నుంచి పాతగుంతకల్లులోని హిందూ స్మశానవాటికకు వృద్ధుడి శవాన్ని తరలించి అక్కడ సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. ఆ నలుగురు వ్యవస్థాపక అధ్యక్షుడు మంజుల వెంకటేష్, సభ్యులు రవీంద్ర, క్రిష్ణమూర్తి, ప్రవీణ్, భాస్కర్, వంశీ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగూరే



డాగురే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

తాడిపత్రి అర్బన్: లూయిస్ డాగురే ఫొటోగ్రఫీకి పితామహుడని వీడియో, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలో లూయిస్ డాగురే 169 వర్ధంతిని వీడియో, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా వారు లూయిస్ డూగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాగురే వేసిన పెయిటింగ్స్ ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచాయన్నారు. నూతనంగా ఎన్నికైన వీడియో, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకం సామాజిక బాధ్యత



గుత్తిలో మొక్కలు నాటుతున్న సీడీపీఓ, అంగన్‌వాడీ కార్యకర్తలు

గుత్తి: మొక్కల పెంపకాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని సీడీపీఓ ఢిల్లీశ్వరి పేర్కొన్నారు. పట్టణంలోని ఐసీడీసీ ప్రాజెక్ట్ కార్యాలయ ఆవరణలో హరిత అనంత ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఐసీడీఎస్ అధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సీడీపీఓ ఢిల్లీశ్వరి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ జీవిత కాలంలో కనీసం ఐదు మొక్కలు నాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. చెట్లు అధికంగా ఉంటే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్నారు. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగేశ్వరి, సీనియర్ అసిస్టెంట్ బాబా ఫకృద్దీన్, జూనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర, బ్లాక్ కో-ఆర్డినేటర్ యుగేందర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుదాం

యల్లనూరు: మండలంలో ప్రభుత్వ కార్యాలయాల్లో బుధవారం హరిత అనంత ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు జయప్రసాద్, ఎస్ కొత్తపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఎంఈఓ-2 పరమేశ్వరరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు పెద్దారెడ్డి, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ లీడర్ విజయలక్ష్మి మొక్కలు నాటి నీరు పోశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ఆక్సిజన్ లేకపోతే సమస్త జీవరాశుల మనుగడ ఉండదన్నారు.

పాఠశాలకు బీరువా, కుర్చీల వితరణ



బీరువా, కుర్చీలు అందిస్తున్న దాతలు

గుత్తి రూరల్: బేతాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మనోహర్ అనే దాత బీరువా, ఉపాధ్యాయులు నరేంద్రనాథ్ గౌడ్, నిరుపమలు బుధవారం 11 కుర్చీలను విరాళంగా ఇచ్చారు. వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మనోహర్ తన కుమార్తె జ్యోతిక పుట్టిన రోజు సందర్భంగా పాఠశాలకు రూ.16 వేలు విలువ చేసే బీరువాను అందజేశారు. అదే విధంగా పాఠశాల ఉపాధ్యాయులు నరేంద్రనాథ్, గణిత ఉపాధ్యాయిని నిరుపమలు పాఠశాలకు 11 కుర్చీలను హెచ్‌ఎం మహాలక్ష్మికి అంజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో దాతలకు శాలువా, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు ఓబుళపతి, రామకృష్ణయ్య, సులోచన, సాధన, మాదన్న, రత్నకుమారి, సుజాత, చంద్రకళ పాల్గొన్నారు.

తపాలా సేవలను విస్తృతం చేయాలి



పోస్టల్ సిబ్బందితో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ గంపస్వామి

శింగనమల: గ్రామీణ ప్రాంతాల్లో తపాలా సేవలను విస్తృతం చేయాలని అనంతపురం పోస్టల్ సూపరింటెండెంట్ గంపస్వామి సిబ్బందికి సూచించారు. బుధవారం తరిమెల పోస్టాఫీస్‌ను తనిఖీ చేసి, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టాఫీస్‌లలో ఆన్‌లైన్ అకౌంట్లు చేస్తున్నట్లు ప్రజలకు తెలియజేయాలన్నారు. పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌పై ప్రజలకు తెలిజేయాలన్నారు. తపాల శాఖ ద్వారా అందించే సేవలపై ప్రజలకు వివరించాలన్నారు. గుంతకల్లు డివిజన్ ఏఎస్పీ విజయకుమార్, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

పెద్దవడుగూరు : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో టెన్త్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బుధవారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. రాజుల చెన్నమ్మ జ్ఞాపకార్థం ఆమె చెల్లెలు రామసుబ్బమ్మ, సోదరుడు జానకిరామయ్య ప్రథమ స్థానంలో నిలిచిన భవానికి రూ.5500, రెండో స్థానంలో నిలిచిన సింధూజకు రూ.4,500 నగదు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గార్లదిన్నె: తిమ్మంపేట సమీపంలో 44వ జాతీయ రహదారిపై బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. ఓ గుర్తుతెలియని వ్యక్తి గార్లదిన్నె నుంచి పామిడి వైపు బైక్‌పై వెళ్తుండగా తిమ్మంపేట సమీపంలో డివైడర్ ఢీన్నాడు. తలకు తీవ్రగాయాలైన అతడిని స్థానికులు 108లో అనంతపురము ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

తాడిపత్రి రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఉదయం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఈఓఆర్‌డీ జిలాన్ తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హజరు కావాలని కోరారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

తాడిపత్రి అర్బన్: గురువారం ఉదయం 11 గంటలకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎం జీయల్ శంకర్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రయాణికులు తమ సూచనలు, సలహాలను 9959225856 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన చిన్నబాబు



మాజీ సీఎం జగన్‌ను కలిసిన చిన్నబాబు

గుంతకల్లుటౌన్: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డిని గుంతకల్లు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్, పార్టీ యువనేత గాదిలింగేశ్వరబాబు(చిన్నబాబు) మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం తాడేపల్లిలోని జగన్ నివాసంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

వైఎస్ జగన్‌ను కలిసిన రమేష్‌రెడ్డి



వైఎస్.జగన్‌తో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొనుదుల రమేష్‌రెడ్డి

తాడిపత్రి: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొనుదుల రమేష్‌రెడ్డి బుధవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా జగన్ తనను ఆప్యాయంగా పలకరించి ఎన్నికల అనంతరం తాడిపత్రిలో చోటు చేసుకున్న పరిణామాలు, నియోజకవర్గంలో పార్టీ శ్రేణుల పరిస్థితిపై ఆరా తీసినట్లు రమేష్‌రెడ్డి తెలిపారు.

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి

బుక్కరాయసముద్రం: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే బండారు శ్రావణి కోరారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సునీత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రావణి మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి ఎద్దటి నివారణకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో ఏఏ సమస్యలున్నాయో నివేదికల రూపంలో తమకు తెలియజేయాలన్నారు. తహసీల్దార్ హనుమంత నాయక్, ఎంపీడీఓ శోభారాణి, మేజర్ పంచాయతీ సర్పంచ్ పార్వతి, ఈఓఆర్డీ దామోదరమ్మ, ఏఓ శ్రీవాణి, ఏఓ శ్యాంసుందర్‌రెడ్డి, డాక్టర్లు లక్ష్మి స్వాతి, పెద్దన్న, ఏపీఓ పోలేరయ్య, ఉద్యాన శాఖ అధికారి శైలజ, ట్రాన్స్‌కో ఏఈ ప్రతాప్‌కుమార్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా సమావేశానికి ముందు జెడ్పీటీసీ భాస్కర్ నేతృత్వంలో వైస్ ఎంపీపీ జయలక్ష్మి తోపాటు వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, సర్పంచులు పార్టీ కండువాలతో ర్యాలీ నిర్వహించారు.

తాగునీటి సమస్యపై అధికారుల నిలదీత



తాగునీటిపై మున్సిపల్ డీఈ హేమచంద్రతో వాగ్వాదం చేస్తున్న దాసరికాలనీ మహిళలు

గుత్తి: పట్టణంలోని దాసరి కాలనీకి చెందిన పలువురు మహిళలు బుధవారం తాగునీటి సమస్యపై మున్సిపల్ అధికారులను నిలదీశారు. వివరాల్లోకి వెళితే దాసరి కాలనీకి మున్సిపల్ అధికారులు 15 రోజులుగా తాగునీరు సరఫరా చేయడం లేదు. ఈ నేపథ్యంలో కాలనీకి చెందిన పలువురు మహిళలు కాలనీ వద్ద నుంచి ర్యాలీగా మున్సిపల్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ డీఈ హేమచంద్రతో పాటు ఏఈ ఇతర మున్సిపల్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. డీఈ హేమచంద్ర స్పందించి తాగు నీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.